రెండో పెండ్లికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

ఉద్యోగులకు అస్సాం ఆదేశాలు

గౌహతి : తమ మతం ఆమోదించినప్పటికీ.. రెండో వివాహం చేసుకోవాలనుకునే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శుక్రవారం తెలిపారు. భార్య బతికుండగా ఉద్యోగులు రెండో వివాహం చేసుకోవడాన్ని ఇటీవల ప్రభుత్వం నిషేధించింది. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ప్రభుత్వ ఉద్యోగి రెండో వివాహం చేసుకోవడానికి సర్వీస్ నిబంధనలు అంగీకరించవని ఆయన చెప్పారు. అయితే కొన్ని మతాల్లో రెండో వివాహం తప్పుకాదని, అలాంట ప్పుడు రూల్స్ ప్రకారం అలాంటి ఉద్యోగి తప్పనిసరిగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అశోకా వర్సిటీ వ్యవస్థాపకులపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ : అశోకా యూనివర్సిటీ వ్యవస్థాపకులకు సంబంధించిన పారాబొలిక్ డ్రగ్స్ కంపెనీ కేసులో శుక్రవారం ఈడీ దాడులు నిర్వహించింది. ఢిల్లీ, ముంబై, ఛండీగఢ్, పంచకుల, అంబాల తదితర ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. పారాబొలిక్ డ్రగ్స్ లిమిటెడ్ డైరెక్టర్లు ప్రణవ్ గుప్తా, వినీత్ గుప్తా రూ.1600 కోట్ల బ్యాంక్ మోసానికి పాల్పడ్డారని ఈడీ వర్గాలు తెలిపాయి. వీరిద్దరూ అశోకా యూనివర్సిటీ వ్యవస్థాపకులని తమ విచారణలో తేలినట్టు తెలిపింది. దీనిపై అశోకా యూనివర్సిటీ స్పందిస్తూ ఈ కేసుకు, యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది.

బెంగాల్ మంత్రి జ్యోతి ప్రియో అరెస్ట్

కోల్‌కతా : రేషన్ పంపిణీకి సంబంధించిన కేసులో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ మంత్రి జ్యోతిప్రియో మల్లిక్‌ను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. 18 గంటల విచారణ అనంతరం మంత్రిని శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం అటవీ మంత్రిగా ఉన్న జ్యోతిప్రియో ఆహార, సరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రేషన్ కుంభకోణం జరిగిందని ఆరోపించిన ఈడీ.. మంత్రిని తమ కస్టడీకి ఇవ్వాలని తాజాగా న్యాయస్థానాన్ని కోరింది. 'పెద్ద కుట్రలో తాను బాధితుడినని' మంత్రి ఈ సందర్భంగా వాపోయారు. బీజేపీ నేత సువేందు అధికారి తనను ఇందులో ఇరికించారని ఆరోపించారు. కాగా, మంత్రి అరెస్ట్‌ను అధికార టీఎంసీ తీవ్రంగా ఖండించింది.

హరీశ్ రావత్‌కు సీబీఐ సమన్లు

న్యూఢిల్లీ : లంచం, హార్స్‌ట్రేడింగ్ కేసులకు సంబంధించి ఉత్తరాఖండ్ మాజీ సీఎం, కాంగ్రెస్ నాయకుడు హరీశ్ రావత్‌కు సీబీఐ శుక్రవారం సమన్లు జారీచేసింది. కొద్ది రోజుల క్రితం కారు ప్రమాదంలో గాయపడ్డ ఆయన, డెహ్రాడూన్‌లోని జాలీ గ్రాంట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. దవాఖానకు వచ్చి సీబీఐ తనకు సమన్లు అందజేయటంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హార్స్ ట్రేడింగ్ కేసులో హరీశ్ రావత్ తోపాటు మాజీ కేంద్రమంత్రి హరక్ సింగ్ రావత్, సమాచార్ ప్లస్ న్యూస్ ఛానల్ ఉమేశ్ కుమార్‌లను సీబీఐ నిందితులుగా చేర్చింది.

రామ మందిరం ముహూర్తం ఖరారు

లక్నో, అక్టోబర్ 27: ఆయోధ్యలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రామ మందిర నిర్మాణంలో రాముని ప్రాణప్రతిష్ఠకు ముహూర్తం ఖరారైంది. పది రోజుల పాటు జరిగే ప్రతిష్ఠ ఉత్సవాలు వచ్చే ఏడాది జనవరి 16న ప్రారంభమవుతాయి. ఆలయ గర్భగుడిలో రాముని విగ్రహ ప్రతిష్ఠను 2024 జనవరి 22 మధ్యాహ్నం 12.45-1.00 గంటల మధ్య నిర్వహించనున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ప్రముఖ వేద పండితుడు వారణాసి లక్ష్మీ కాంత్ దీక్షిత్ దీనిని నిర్వహిస్తారన్నారు.

ప్రజలపై ధరల పోటు!

- ఇప్పటికే ఆకాశన్నంటుతున్న నిత్యావసరాలు
- నిన్నటివరకు టమోటా మోత.. నేడు ఉల్లి ఘాటు
- రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50-80
- ధరలు మరింత పెరుగుతాయని అంచనా
- బీజేపీ పాలనలో ప్రజల బతుకు ఆగమాగం
- ఇంధన ధరల పెంపుతో సామాన్యుడిపై భారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కిన నాటి నుంచి ధరల మోతతో సామాన్యుడు విలవిలలాడుతున్నాడు. పేద, మధ్యతరగతి ప్రజలపై నిత్యం ఏదోక నిత్యావసర వస్తువుల ధరల బండ పడుతూనే ఉన్నది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరాఘాతంలో దేశంలోని ప్రజలు అల్లాడుతుంటే.. మరోవైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదు. నూనెలు, పప్పులు, ఇతర నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యుడి కొనుగోలు శక్తి క్షీణించింది. ఈ మధ్య వరకు టమోటా ధరల 'మోత' మోగగా, ఇప్పుడు ఉల్లిగడ్డల వంతు వచ్చింది. కొనకుండానే, కోయకుండానే వినియోగదారుల కండ్లలో ఉల్లి నీళ్లు తెప్పిస్తున్నది. దేశంలో ఉల్లిపాయల ధరలు ప్రస్తుతం ఆకాశన్నంటాయి. నెల రోజుల వ్యవధిలో ఉల్లి ధర దాదాపు రెట్టింపు అయింది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ఉల్లి ధర 57 శాతం పెరిగింది. ఏడాది క్రితం రూ.30గా ఉన్న సగటు కిలో ఉల్లి ధర శుక్రవారం రూ.47కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో అయితే గత వారం వరకు రూ.35-40 పలికిన ఉల్లి ప్రస్తుతం రూ.50-80కి చేరిందని వినియోగదారులు చెబుతున్నారు. గత వారం కిలో ఉల్లి రూ.40కు కొన్న తాను ఇప్పుడు రూ.80 కొనాల్సి వచ్చిందని నోయిడాకు చెందిన శేఖర్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఉల్లి పంట అత్యధికంగా పండించే మహారాష్ట్రలోని నాసిక్‌లో కిలో ఉల్లి రూ.25 నుంచి రూ.50-60కి పెరిగింది. ఒడిశాలోని భువనేశ్వర్‌లో కొన్ని మార్కెట్లలో ధర రూ.80 వరకూ ఉన్నది. ఖరీఫ్ పంట ఉత్పత్తి ఆలస్యం నేపథ్యంలో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని, డిసెంబర్ చివరి వరకు ధరల మంట ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ధరలను నియంత్రించే పేరుతో కేంద్ర ప్రభుత్వం బియ్యం, గోధుమలు, చక్కెర తదితరాల ఎగుమతులపై నిషేధం, ఆంక్షలు విధిస్తున్న పరిస్థితి దేశంలో నెలకొన్నది.

ధరలతో పెరిగిన కుటుంబ వ్యయం

పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ఒక సామాన్యుడి కుటుంబ వ్యయం తడిసి మోపెడవుతున్నది. అంచనాలకు అందని విధంగా ధరాఘాతంలో వారి బతుకులు అతలాకుతలం అవుతున్నాయి. ఇంట్లో వినియోగించే ప్రతి వస్తువు ధర పెరిగిన కారణంగా ఏం కొనే టట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు అనే విధంగా సామాన్యుడి పరిస్థితి తయారైంది. ఓవైపు ధరలు పెరుగుతున్నా సామాన్యుడి ఆదాయం మాత్రం పెరుగడం లేదు. కుటుంబానికి వస్తున్న నెలవారీ ఆదాయానికి, ధరల పెరుగుదల కారణంగా అవుతున్న ఖర్చుకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు.

ఇంధన ధరల పెంపుతో భారం

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.71, రూ.55గా ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలు మోదీ పాలనలో ఏకంగా సెంచరీ కొట్టేశాయి. 2014 నుంచి ఇప్పటి దాకా మోదీ సర్కార్ డీజిల్‌పై 512 శాతం, పెట్రోల్‌పై 194 శాతం చొప్పున ఎక్సైజ్ పన్నులను పెంచింది. దీంతో ఉత్పాదక ఖర్చులు, రవాణా చార్జీలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి ఆ ప్రభావం నిత్యావసర సరుకులపై పడిందనేది ఆర్థిక రంగ నిపుణుల విశ్లేషణ. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ మోదీ సర్కార్ దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా అదే భారాన్ని కొనసాగిస్తున్నది. క్రూడాయిల్ ధరల తగ్గుదల లబ్ధిని సామాన్యుడికి చేరనీయకుండా.. ఆ లాభాలను తన ఖజానాకు మళ్లించుకొంటున్నది.

ఎన్నికల సమయంలో జిమ్మిక్కులు

పంట గ్యాస్ సిలిండర్ ధరలను రూ.400 నుంచి ఏకంగా దాదాపు మూడు రెట్లు పెంచి.. పేద, మధ్యతరగతి ఇంట్లో పొగ పెట్టింది. అధిక ధరల కారణంగా చాలా కుటుంబాలు తమ ఇండ్లలోని ఎల్పీజీ సిలిండర్లను మూలన పెట్టేసి తిరిగి కట్టెల పొయ్యి వైపునకు మళ్లాయి. అయితే ఈ క్రమంలో సరిగ్గా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిలిండర్ ధరను కొంత మేర తగ్గించి.. కమలం పార్టీ తన ఎన్నికల నైజాన్ని బయటపెట్టుకొనాదనే విమర్శలు పెద్దయెత్తున వచ్చాయి.

బీజేపీ అధికారంలోకి రాకముందు, ప్రస్తుత ధరలు (దాదాపుగా)

నిత్యావసర వస్తువు	2014	ప్రస్తుతం
వంటగ్యాస్	399	955
పెట్రోల్	71	109
డీజిల్	55	97
బియ్యం (కిలో)	27	52
ఉల్లిపాయలు	17	80
గోధుమ పిండి	22	67
ఉప్పు	10	25

స్వీడన్‌లో ఎలక్ట్రిక్ రోడ్లు

డ్రైవింగ్ చేస్తుండగానే వాహనానికి చార్జింగ్

స్టాక్‌హోం, అక్టోబర్ 27: సరికొత్త రవాణా వ్యవస్థకు స్వీడన్ నాంది పలకబోతున్నది. ఎలక్ట్రిక్ వాహనాల్ని నడుపుతూ చార్జింగ్ చేసుకునే 'ఎలక్ట్రిక్ రోడ్స్' నిర్మిస్తున్నది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఎలక్ట్రిక్ రోడ్డు స్వీడన్ రాజధాని స్టాక్‌హోం నడిబొడ్డున నిర్మాణం జరుపుకుంది. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) చార్జింగ్ కోసం పదే పదే ఆగాల్సిన అవసరం లేకుండా సరికొత్త టెక్నాలజీ (కండక్టీవ్ రెయిల్స్, ఇండక్టీవ్ కాయిల్స్‌తో)ని ఉపయోగించి 3000 కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మిస్తున్నది. రోడ్డు మధ్యలో ఏర్పాటుచేసిన భాగం నుంచి సురక్షిత, సమర్థవంతమైన శక్తి ఈవీకి బదిలీ చేయటం ఈ టెక్నాలజీ ప్రత్యేకత. వైర్‌లెస్ పద్ధతిలోనూ చార్జింగ్ చేయగలిగే 'ఇండక్టివ్ చార్జింగ్'ను సైతం 'ఎలక్ట్రిక్ రోడ్లు' కలిగి ఉంటాయి. ఎలక్ట్రిక్ రోడ్ల నిర్మాణంపై అమెరికా సహా పలు దేశాల్లో ప్రయోగాలు ప్రాథమిక దశలో ఉన్నాయి.

పెయింట్స్‌లో మోతాదుకు మించి సీసం

న్యూ ఢిల్లీ : గోడకు వేసే రంగులు ఆరేండ్లలోపు చిన్నారుల మెదడును విషపూరితం చేస్తున్నాయని తాజా అధ్యయనాల్లో తేలింది. ఇండియాలో లభించే 90 శాతం పెయింట్స్‌లో ఉన్న సీసం (లెడ్) ఇందుకు కారణమని తేల్చాయి. 51 పెయింట్స్‌పై నిర్వహించిన రెండు అధ్యయనాల్లో కేంద్రంవిధించిన పరిమితి (90పీపీఎం)కి మించి లెడ్ ఉన్నట్టు తేలింది. 76.4శాతం అనుమతించదగ్గ పరిమితికంటే 111 రెట్లు ఎక్కువగా సీసం ఉన్నట్టు గుర్తించారు. ఎక్కువ సీసం ఉన్న పెయింట్స్ సూక్ష్మ, మధ్యతరహా పెయింట్స్ తయారీదారుల నుంచే వస్తున్నట్టు కనుగొన్నారు.

'నవంబర్ 5 తర్వాత విచారణకు హాజరవుతా'

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర పార్లమెంటు ఎథిక్స్ కమిటీకి ఓ లేఖ రాశారు. తనపై జరుగుతున్న దర్యాప్తునకు హాజరయ్యేందుకు తనకు మరికొంత సమయం అవసరమని తెలిపారు. ఈ నెల 31న హాజరుకావాలని తనకు సమన్లు ఇచ్చారని, నవంబరు 4 వరకు ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉన్నాయని, నవంబరు 5 తర్వాత హాజరుకాగలనని తెలిపారు. పార్లమెంటులో ప్రశ్నలు అడగడానికి ఓ వ్యాపారవేత్త నుంచి మహువా ముడుపులు తీసుకున్నట్లు ఆమె మాజీ సన్నిహితుడు దేహద్రాయ్ ఆరోపించారు.

టిప్పు సుల్తాన్ కత్తికి వేలంలో కోటి

లండన్: 18వ శతాబ్దపు మైసూరు రాజు టిప్పు సుల్తాన్‌కు చెందిన కత్తి, జెమ్ సెట్ క్రిస్టీస్ వేలంలో భారీ ధర పలికాయి. వీటిని రూ.1.01 కోట్లు ఇచ్చి ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. గురువారం జరిగిన ది ఆర్ట్ ఆఫ్ ది ఇస్లామిక్ అండ్ ఇండియన్ వరల్డ్ సేల్‌లో ఆయనకు చెందిన మరో కత్తికి ముందుగా ఆశించిన ధర రాలేదు. టిప్పు మరణానంతరం భారత దేశంలో బ్రిటిష్ అధికారాన్ని బలోపేతం చేసిన చార్లెస్ వద్ద ఈ కత్తులు ఉన్నాయి. వీటిని అమ్మడం ద్వారా వచ్చే సొమ్మును ఈ కుటుంబానికి చెందిన పోర్ట్ ఎలియట్ ఎస్టేట్‌కు మరమ్మతులు చేయించడానికి ఉపయోగిస్తామని ఈ ఎస్టేట్ అధికార ప్రతినిధి తెలిపారు.

వ్యభిచారం క్రిమినల్ నేరమే!

ప్రభుత్వానికి పార్లమెంటు కమిటీ సిఫారసు?

న్యూఢిల్లీ: వ్యభిచారాన్ని క్రిమినల్ నేరంగా పునరుద్ధరించాలని ప్రభుత్వానికి ఓ పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసే అవకాశం కనిపిస్తున్నది. వలస పాలన కాలంనాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లకు బదులుగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లను తీసుకొస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లులను ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అనంతరం వీటిని స్థాయీ సంఘం పరిశీలనకు పంపించారు. ఈ కమిటీ శుక్రవారం సమావేశమైంది. తదుపరి సమావేశం నవంబరు 6న జరుగుతుంది. వ్యభిచారం నేరం కాదని సుప్రీంకోర్టు 2018లో తీర్పు చెప్పింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, వ్యభిచారాన్ని క్రిమినల్ నేరంగా పునరుద్ధరించాలని ఈ కమిటీ సిఫారసు చేసే అవకాశం ఉన్నది.

ఉన్నత విద్యకు విదేశీ బాట

ఏటికేడు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

న్యూఢిల్లీ: ఉన్నత విద్య కోసం విదేశాల బాట పడుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. అత్యధికంగా విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్యలో పంజాబ్, తెలంగాణ, మహారాష్ట్ర ముందువరుసలో ఉన్నాయి. భారతీయ విద్యార్థులు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియాతోపాటు ఇటీవలి కాలంలో కొత్తగా ప్రాధాన్యం ఇస్తున్న దేశాల జాబితాలో జర్మనీ, ఐర్లాండ్, సింగపూర్, రష్యా, ఫ్రాన్స్ తదితర దేశాలు ఉన్నాయని తాజా నివేదిక పేర్కొన్నది. శుక్రవారం జరిగిన గ్లోబల్ ఎడ్యుకేషన్ కాన్క్లేవ్ సందర్భంగా 'బియాండ్ బెడ్స్ అండ్ బౌండరీస్: ఇండియన్ స్టూడెంట్స్ మొబిలిటీ రిపోర్ట్-2023' నివేదికను విడుదల చేశారు. 2019లో విదేశాల్లో 10.9 లక్షల మంది విద్యను అభ్యసించగా.. 2025 నాటికి ఈ సంఖ్య దాదాపు 20 లక్షలకు చేరుతుందని నివేదిక అంచనా వేసింది.

పాక్ ప్రయోగించిన మోర్టారును చూపిస్తున్న స్థానికుడు

భారత్ స్థావరాలపై పాక్ రేంజర్ల కాల్పులు

ఇద్దరికి స్వల్ప గాయాలు.. కాల్పులను తిప్పికొట్టిన సైన్యం

న్యూఢిలీ, అక్టోబర్ 27: పాకిస్థాన్ మరోమారు కవ్వింపు చర్యలకు దిగింది. జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాక్ రేంజర్లు యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డారు. భారత పోస్టులు, పౌర ఆవాసాలే లక్ష్యంగా దాదాపు ఏడు గంటలపాటు మోర్టార్లు ప్రయోగించారు. భారీ మెషీన్ గన్స్‌తో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ బస్వరాజ్ రెండు చేతులకు గాయాలు కాగా, అర్నియా సెక్టార్‌కు చెందిన రజ్నీదేవి అనే స్థానికురాలు గాయపడింది. పాక్ వైపు నుంచి గురువారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన కాల్పులు శుక్రవారం తెల్లవారుజామున 2.45 గంటలకు వరకు కొనసాగినట్టు బీఎస్ఎఫ్ తెలిపింది. పాక్ కాల్పులను భారత జవాన్లు సమర్థంగా తిప్పికొట్టారు. జమ్ము జిల్లాలోని అర్నియా, ఆర్ఎస్‌పురా సెక్టర్లలోనూ కాల్పులు కొనసాగాయి. పాక్ కాల్పుల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలు రాత్రంతా బంకర్లలో తలదాచుకుని కాల్పులు ఆగిన తర్వాత తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.

'వింధ్య'లో బీజేపీకి దెబ్బ!

- మధ్యప్రదేశ్‌లో బీజేపీ రెబల్ మంత్రి కొత్త పార్టీ
- ప్రత్యేక రాష్ట్రం 'వింధ్య ప్రదేశ్' నినాదంతో స్థాపన
- ఎన్నికల్లో 40 స్థానాల్లో పోటీ చేస్తామని వెల్లడి

భోపాల్, అక్టోబర్ 27: మధ్యప్రదేశ్‌లో వచ్చే నెల జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతతో ఇప్పటికే ఓటమి భయంలో ఉన్న బీజేపీకి మరో గట్టి దెబ్బ పడింది. బీజేపీపై తిరుగుబాటు జెండా ఎగుర వేసిన రాష్ట్ర మంత్రి నారాయణ్ త్రిపాఠి సొంత పార్టీని స్థాపించారు. వింధ్య రీజియన్ అభివృద్ధి, ప్రత్యేక రాష్ట్ర సాధన ఎజెండాతో పార్టీ పేరును 'వింధ్య జనతా పార్టీ'గా ప్రకటించారు. అదేవిధంగా 25 మంది కూడిన అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను కూడా విడుదల చేశారు. శుక్రవారం భోపాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో త్రిపాఠి మాట్లాడుతూ మొత్తం 40 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను నిలబెడుతామని తెలిపారు. వింధ్య అభివృద్ధి గురించి మాట్లాడితే బీజేపీలో రెబల్స్‌గా ముద్ర వేస్తున్నారని విమర్శించారు. వింధ్య రీజియన్ ప్రజలు ఏండ్లుగా మోసపోతున్నారని, ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం ఏ ప్రభుత్వం కూడా ఏమీ చేయలేదని అన్నారు. రాష్ట్రంలో గత 20 ఏండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ.. వింధ్య రీజియన్ అభివృద్ధికి ఏ విధమైన నిర్ణయాలు తీసుకోలేదని దుయ్యబట్టారు. అనేక వనరులు ఉన్నప్పటికీ, ఉపాధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'వింధ్య ప్రదేశ్' ఏర్పాటే తమ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే ముందుకొచ్చామని త్రిపాఠి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ్ త్రిపాఠి (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

పంచతంత్రం

ఆ 9 సీట్లలో బోణీ కొట్టేనా?

ఛత్తీస్‌గఢ్ ఏర్పడినప్పటి నుంచి గెలవని బీజేపీ

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ 2000 సంవత్సరంలో ఏర్పాటైంది. 15 ఏండ్ల పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టింది. అయితే తొమ్మిది సీట్లలో మాత్రం ఒక్కసారి కూడా విజయం సాధించలేకపోయింది. దీంతో ఈసారైనా ఈ సీట్లలో బోణీ కొట్టాలని కమలం పార్టీ ఆరాటపడుతున్నది. నవంబర్ 7, 17 తేదీల్లో రెండు విడతల్లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిలో సీతాపూర్, పలితనాఖర్, మార్వాహి, మోహ్లా-మన్‌పూర్, కుంట, ఖరిస, కోర్బా, కోట, జైజాపూర్ సీట్లలో బీజేపీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా గెలవలేదు.

మరాఠా కోటాపై ప్రధాని మౌనమేల?: జరాంగే

జల్నా: మహారాష్ట్రలోని షిర్డీలో గురువారం పర్యటించిన ప్రధాని మోదీ మరాఠా కోటాపై స్పందించకపోవటాన్ని మరాఠా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే తప్పుబట్టారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్‌లే ఇందుకు కారణమని, రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాని మోదీ వద్ద వారు లేవనెత్తలేదని ఆయన మండిపడ్డారు. శుక్రవారం దీక్షాస్థలం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, 'మరాఠా రిజర్వేషన్లపై ప్రధాని మోదీ స్పందిస్తారని ఎంతో ఆశించాం. కానీ అలా జరగలేదు. ప్రధాని మోదీ, సీఎం షిండే, ఫడ్నవీస్ తీరు నిరాశపర్చింది' అని అన్నారు.

చైనా మాజీ ప్రధాని కెకియాంగ్ కన్నుమూత

బీజింగ్: చైనా మాజీ ప్రధాని లీ కెకియాంగ్ (68) షాంఘైలో మృతి చెందారు. ఆయనకు గురువారం గుండెపోటు వచ్చింది. రాత్రి 12.10 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన గతంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధ్యక్ష పదవి కోసం జీ జిన్‌పింగ్‌తో పోటీ పడ్డారు. చివరికి ఆయన నంబర్-2 స్థానంతో సరిపెట్టుకున్నారు. 2013 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేశారు. చైనా ఆర్థిక వ్యవస్థను ఆయన సమర్థంగా నిర్వహించారనే పేరుంది.

'దుమ్ము' రేపిన ల్యాండర్ విక్రమ్

సాఫ్ట్ ల్యాండింగ్‌లో పైకి లేచిన 2 టన్నుల మట్టి

బెంగళూరు, అక్టోబర్ 27: చంద్రుడిపై పరిశోధనల నిమిత్తం ఇస్రో పంపిన చంద్రయాన్-3 నిజంగానే 'దుమ్ము'రేపింది. ఆగస్టు 23న ల్యాండర్ విక్రమ్ జాబిల్లిపై అడుగుపెట్టే క్రమంలో శివశక్తి పాయింట్ వద్ద పెద్ద మొత్తంలో దుమ్ము, ధూళి, చిన్న చిన్న రాళ్లు పైకిలేచాయని, దాదాపు 2.06 టన్నులమేర మట్టి 108 చదరపు మీటర్ల విస్తీర్ణంలో స్థానభ్రంశం చెందినట్టు ఇస్రో సైంటిస్టులు వెల్లడించారు. దీనికి సంబంధించి తాజా వివరాల్ని ఇస్రో 'ఎక్స్'లో విడుదల చేసింది. సాఫ్ట్ ల్యాండింగ్ సమయంలో చంద్రుడి పైపొరలోని పదార్థాలు (దుమ్ముధూళి, ఖనిజ, రాళ్ల శకలాలు వంటివి) పక్కకు జరిగినట్టు తెలిపింది. విక్రమ్ ల్యాండర్ చుట్టూ ఆ పదార్థాలతో భారీ వలయాకార పరిధి ఏర్పడినట్టు ఇస్రో పేర్కొన్నది.

త్వరలో సీఎం కుర్చీలో డీకే

రెండున్నరేండ్ల తర్వాత సిద్ధరామయ్య ఇంటికే

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గౌడ

దేవనగెరె, అక్టోబర్ 27: మరో రెండున్నరేండ్ల తర్వాత కర్ణాటక ముఖ్యమంత్రి పీఠంపై ప్రస్తుత ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూర్చుంటారని అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రవికుమార్ గౌడ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారమిక్కడ ఆయన మాట్లాడుతూ 'రెండున్నర సంవత్సరాల తర్వాత శివకుమార్ సీఎం అవుతారు. ఇందులో రెండో మాటకు తావులేదు. ఆయన పార్టీ కోసం కష్టపడ్డారు. ఈ విషయంలో ఎలాంటి సందిగ్ధత లేదు' అని పేర్కొన్నారు. 2019లో కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వాన్ని కూలగొట్టిన ఓ గుంపు.. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిందని ఆరోపించారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు, మంత్రి పదవి ఆశచూపుతున్నదని తెలిపారు.

రూ.50 కోట్లు.. మంత్రి పదవి ఆఫర్

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే గానిగ రవి

బెంగళూరు, అక్టోబర్ 27: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, రూ.50 కోట్లు, మంత్రి పదవి ఇస్తామంటూ తమ ఎమ్మెల్యేలకు ఆఫర్లు వస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే గానిగ రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం దేవనగరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పేరు ప్రస్తావించకుండా 'ఆ పార్టీకి చెందిన కొంతమంది నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలుసుకున్నారు. ఎమ్మెల్యేలతో చర్చలు జరిపిన వారిలో బీఎస్ యెడియూరప్ప మాజీ వ్యక్తిగత కార్యదర్శి ఎన్ఆర్ సంతోష్ ఉన్నారు. భారీ మొత్తంలో నగదు, మంత్రి పదవి ఇస్తామంటూ ప్రలోభపెడుతున్నారు. ఈ విషయాన్ని మా ఎమ్మెల్యేలు నాకు చెప్పారు' అని ఎమ్మెల్యే రవి తెలిపారు. ఎన్ఆర్ సంతోష్ జేడీ(ఎస్) తరపున పోటీ చేసి ఓడిపోయాడని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఈ అంశాన్ని సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లానని గానిగ రవి వివరించారు.

35 కిలోమీటర్లు రిక్షా తొక్కుతూ..

భద్రక్: గొడవల్లో గాయపడ్డ తన తండ్రిని రక్షించుకోవడానికి 14 ఏండ్ల బాలిక పెద్ద సాహసమే చేసింది. చికిత్స చేయించడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేని దైన్య పరిస్థితుల్లో తండ్రిని రిక్షాలో ఎక్కించుకుని 35 కిలోమీటర్లు తొక్కి దవాఖానలో చేర్చింది. ఈ ఘటన ఒడిశాలోని భద్రక్‌లో ఈ నెల 23న చోటుచేసుకోగా, గురువారం వెలుగులోకి వచ్చింది. బాలిక తండ్రిని పరీక్షించిన డాక్టర్లు ఆపరేషన్ చేయాలని, వారం రోజుల తర్వాత రమ్మని పంపించేశారు. నాలుగు రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి రావడంతో భద్రక్ ఎమ్మెల్యే సాహిబ్ మాలిక్, మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర దాస్ వచ్చి తండ్రి చికిత్సకు అవసరమయ్యే సహాయాన్ని అందజేస్తామని హామీనిచ్చారు. తండ్రిని రక్షించుకోవడానికి బాలిక చేసిన సాహసాన్ని పలువురు ఈ సందర్భంగా అభినందించి, తగిన విధంగా ఆదుకుంటామని చెప్పారు.

గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఈఏసీ కార్డులు!

వా